సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం : 28 : ఫిబ్రవరి : 2024



మానవ మనుగడకు..

మానవ మనుగడకు పర్యావరణ సమతుల్యం కీలకమని డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



వెంకన్నకు 'శఠగోపం'

గండేడ్ మండలంలోని జంగంరెడ్డిపల్లి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధి పడకేసింది.

వివరాలు 8లో ▸



వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రివేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు క్రీడలు అవసరం



కల్వకుర్తిరూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని జిల్లా నెహ్రూ యువక కేంద్రం అధికారి కోటానాయక్ అన్నారు. స్వామి వివేకానంద సేవా బృందం, నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కల్వకుర్తి మండలం తర్నికల్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బ్లాక్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. ఆసక్తిగల క్రీడల్లో విద్యార్థులు మరింత ప్రావీణ్యం పెంచుకుని, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అనంతరం ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవాబృందం అధ్యక్షుడు శివకుమార్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు చెన్నకేశవులు, చింటు పాల్గొన్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

కల్వకుర్తి: కల్వకుర్తి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో అధికారికంగా ఎలాంటి విద్యుత్ కోతలు లేవని ఏడీఈ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా విషయంలో ఇటీవల కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని కోరారు. సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తే, సంబంధిత అధికారులకు వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థల నుంచి అధికారికంగా ఎలాంటి విద్యుత్ కోతలు లేవని చెప్పారు. గృహ అవసరాలతో పాటు వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.

ఉద్యోగ నియామక ప్రక్రియ నిలిపివేత

నాగర్‌కర్నూల్ క్రైం: ఎన్నికల కోడ్ కారణంగా జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు పోస్టుల భర్తీకి ఈనెల 24న ఉద్యోగ నోటిఫికేషన్ జారీచేశామని.. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు.

సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

కందనూలు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో బుధవారం సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించాలని డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాలలో భాగంగా పాఠశాల స్థాయిలో సైన్స్ ప్రయోగాలు, పుస్తకాల ప్రదర్శన, సెమినార్ల ఏర్పాటుతో పాటు ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. సైన్స్ సంబరాలకు సంబంధించిన ఫొటోలు, రిపోర్టును మార్చి 5వ తేదీలోగా పంపించాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి (9989921105)ని సంప్రదించాలని కోరారు.

పీయూ నాన్‌టీచింగ్ సిబ్బందికి మరోసారి పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీతోపాటు ఉమ్మడి జిల్లాలోని పీజీ సెంటర్లలో పనిచేస్తున్న తాత్కాలిక నాన్‌టీచింగ్ సిబ్బందికి పరీక్ష నిర్వహించేందుకు పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. గతేడాది సిబ్బందికి పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సర్క్యులర్ జారీ చేయగా వివాదం నెలకొనడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఈ అంశాన్ని మరోసారి అధికారులు తెరమీదకు తెచ్చారు. వచ్చే నెల 11లోగా సిబ్బంది తమ విద్యార్హత, అనుభవం, పనిచేస్తున్న కేటగిరి తదితర పూర్తి వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. సిబ్బందికి ఏం స్కిల్స్ ఉన్నాయో వాటిని కూడా పరీక్షించనున్నట్లు తెలుస్తుంది. అయితే గత కొన్నేళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్న సిబ్బందికి పరీక్ష పెట్టడం వల్ల తమను తొలగిస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. అయితే పరీక్ష నిర్వహణకు సంబంధించిన సిలబస్ తదితర అంశాలు మరోసారి సర్క్యులర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్ష ఎలా రాయాలి.. ఏ సిలబస్ ఇస్తారో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

అప్పుడు 'కారు'.. ఇప్పుడు ఎవరు?



మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక

- నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల.. కోడ్ అమల్లోకి
- మార్చి 28న పోలింగ్.. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు
- అప్పటికీ, ఇప్పటికీ మారిన రాజకీయ పరిణామాలు
- 'హస్తం' నుంచి తెరపైకి మన్నె జీవన్‌రెడ్డి పేరు
- పోటీకి 'గులాబీ' ముఖ్య నేతల అనాసక్తి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల వేళ పాలమూరులో సందడి నెలకొంది. ఆయా రాజకీయ పార్టీల్లో ఆశావహ అభ్యర్థుల పోటాపోటీ ప్రయత్నాలు.. యాత్రలు వెరసి రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఈ క్రమంలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ వేడి మరింతగా రాజుకోనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపోటముల ప్రభావం పార్లమెంట్ పోరుపై పడే అవకాశం ఉండడంతో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు సీరియస్‌గా దృష్టిసారించాయి. అప్పటికీ, ఇప్పటికీ మారిన రాజకీయ పరిణామాలు.. బలాబలాలపై ఆయా పార్టీల ముఖ్య నేతలు నియోజకవర్గాల వారీగా క్షేత్ర స్థాయిలో ఆరా తీస్తూ.. పోరు సన్నాహాలకు శ్రీకారం చుట్టేలా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.



గతంలో ఏకగ్రీవ ఎన్నిక

మహబూబ్‌నగర్ స్థానం నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2021లో బీఆర్‌ఎస్‌కు చెందిన కసిరెడ్డి నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవికి గతేడాది డిసెంబర్ 8న రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ మేరకు ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది.

బీఆర్‌ఎస్‌కు బలం ఉన్నా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని **ఎంపీటీసీ, జెడ్పీటీసీ** సభ్యులు, మున్సిపల్ కౌన్సి**లర్లు, ఎమ్మెల్యే**లు ఓటు వేసి ఎమ్మెల్సీని ఎన్ను**కోనున్నారు**. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం **1,221 మం**ది ఓటర్లు ఉండగా.. ఇందులో ఎం**పీటీసీ** సభ్యులు 776 మంది, జెడ్పీటీసీ **సభ్యులు** 71 మంది, మున్సిపల్ కౌన్సిలర్లు **374 మంది** ఉన్నారు. వీరితోపాటు 14 మంది **ఎమ్మెల్యేలు** ఉన్నారు. 2021లో బీఆర్‌ఎస్‌కు **పూర్తిస్థాయి**లో బలం ఉండగా.. ఆ పార్టీ అభ్య**ర్థిగా కసిరెడ్డి** నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యమైంది. పార్టీ మారిన వారు, చనిపోయిన వారు, వివిధ కారణాలతో పదవి కోల్పోయిన వారు.. ఇలా అన్నీ పరిశీలిస్తే స్థానిక సంస్థల్లో ఇప్పటికీ బీఆర్‌ఎస్‌కే బలం ఉంది. 800కుపైగా మంది ఆ పార్టీకి చెందినవారే. కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు 320, ఇతర పార్టీలకు చెందిన వారు వందమంది వరకు ఉన్నారు.

మార్చి 4న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు ఉంటుంది. కాగా, షెడ్యూల్ విడుదలైన సోమవారం నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలతో..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి పాలమూరులోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 స్థానాలను కైవసం చేసుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. మరోవైపు చేసిన పనులకు బిల్లులు రాక.. అప్పుల్లో కూరుకుపోయిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ నేతల వ్యవహార శైలి పట్ల గుర్రుగా ఉన్నారు. పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్, కోస్గి మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. పలుచోట్ల కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మిగతా వారు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలో ప్రస్తుత పరిస్థితులు హస్తానికి అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

'మన్నె'కు అధిష్టానం హామీ

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీల అధినేత మన్నె జీవన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. గత నెలలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లి.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో పార్టీలో చేరారు. ఎంపీ టికెట్ ఆశించినా.. ఎమ్మెల్సీ ఇస్తామని అప్పుడే ఆయనకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఆయనకే ఎమ్మెల్సీ టికెట్ ఖరారైందని.. నీ పని నీవు చేసుకో అనే సంకేతాలు సైతం అధిష్టానం నుంచి వచ్చినట్లు ఆ పార్టీలో విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సైతం ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరు బరిలో ఉంటారనేది ఆసక్తిగా మారింది. ఉమ్మడి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలకే పరిమితం కాగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముఖ్య నేతలెవరూ ఆసక్తిగా లేరనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలో స్థానిక సంస్థల ఓటర్లు ఇలా..

జిల్లా	ఎంపీటీసీ సభ్యులు	జెడ్పీటీసీ సభ్యులు	కౌన్సిలర్లు
మహబూబ్‌నగర్	169	14	86
నాగర్‌కర్నూల్	212	20	86
జోగులాంబ గద్వాల	141	12	77
నారాయణపేట	140	11	56
వనపర్తి	114	14	69
మొత్తం	776	71	374

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

- హాజరు కానున్న 13,871 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి



కల్వకుర్తిలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కందనూలు/అచ్చంపేట: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షల నిర్వహణపై పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై ఏర్పాట్ల గురించి వివరించారు. ఈసారి ఆంగ్లంలో 20 శాతం మార్కులతో ప్రాక్టికల్ పరీక్షలను ఇంటర్ బోర్డు నిర్వహించింది. దీంతో ఉత్తీర్ణత శాతం పెరగడమే కాకుండా ఈసబ్జెక్టులో అధిక మార్కులు సాధించే అవకాశం లభించింది.

జిల్లాలో 32 పరీక్ష కేంద్రాలు..

బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మార్చి 19వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో 15 ప్రభుత్వ, 28 ప్రభుత్వ సెక్టార్, 24 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 6,837 మంది, రెండో సంవత్సరం 7,034 మందితో కలిపి మొత్తం 13,871 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 32 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రశ్నపత్రాలను తెరిచే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు.

సెంటర్ లోకేటర్ యాప్..

పరీక్ష కేంద్రాల చిరునామాను సులభంగా తెలుసుకోవడానికి ఈఏడాది ఎంసెట్ తరహాలో సెంటర్ లోకేటర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హాల్ టికెట్ జారీ సమయంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడతాయన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఇంటర్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో నేరుగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రిన్సిపాల్ సంతకం లేకుండానే పరీక్షలకు హాజరు కావచ్చు. దీనిపై ఇప్పటికే అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీచేశారు.

- పరీక్ష కేంద్రాలకు దూరంగా ఉన్న గురుకులాలు, మోడల్, మైనార్టీ వెల్ఫేర్ కళాశాలల విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఉచితంగా పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.
- పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలు కళాశాలలకు రాగా.. వాటిని పోలీస్ స్టేషన్లలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. కళాశాల సమీపంలోని బుక్‌స్టాల్స్, జిరాక్స్ సెంటర్లు ఓపెన్ చేయొద్దని నిర్వాహకులకు సూచించారు.
- కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, మెడిసిన్ అందుబాటులో ఉంచనున్నారు. ప్రథమ చికిత్స అందించేందుకుగాను ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సూపర్‌వైజర్లను నియమించారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశాం. హాల్‌టికెట్లు అందని విద్యార్థులు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నిర్ణీత సమయం కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష కేంద్రాలను సులభంగా గుర్తించేందుకు లోకేటర్ యాప్‌ను వినియోగించుకోవాలి.

– వెంకటరమణ, ఇంటర్ విద్య నోడల్ అధికారి

ప్రత్యేక బృందాలు ఏర్పాటు..

పరీక్షల పర్యవేక్షణకు ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లైయింగ్ స్క్వాడ్, ఇద్దరు సభ్యులతో సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేశారు. పరీక్షల విధులకు 32 మంది సీఎస్‌లు, 32 మంది డీఓలతో పాటు 11 మంది అడిషనల్ సీఎస్, ఆరుగురు కస్టోడియన్లు, 133 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు ప్రతి కేంద్రం వద్ద ఒక పరిశీలకుడు విధులు నిర్వర్తించనున్నారు. ఈసారి ఇంటర్ బోర్డు సీఎస్, డీఓలకు పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతిని నిషేధించింది. పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఏర్పడితే బోర్డుకు సమాచారం ఇచ్చేందుకుగాను సీఎస్‌కు ఉదయం 9:30 నుంచి 10గంటల వరకు సెల్‌ఫోన్ వినియోగించే అవకాశం కల్పించింది. అదీ కూడా కేంద్రాల్లో కాకుండా కార్యాలయం గదిలో మాత్రమే ఉంటుంది. విద్యార్థుల గైర్హాజరు వివరాలను సైతం ఈసారి ఓఎంఆర్ బార్‌కోడ్ స్కాన్ చేసి, మొబైల్ ద్వారా పంపించాలి.

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



లింగాలలో మాట్లాడుతున్న లక్ష్మణ్

- ప్రజలను వంచించడంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందు దొందే
- బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/లింగాల/బల్మూర్/అచ్చంపేట: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మూడో అతిపెద్ద దేశంగా భారత్ ఎదిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, కాటేపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, లింగాల, బల్మూర్, అచ్చంపేటలలో మంగళవారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పయాత్రలో వారు మాట్లాడారు. ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూస్తున్నాయని.. ఈ ఘనత మోదీతోనే సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో భారత్ అగ్రరాజ్యంగా వెలుగొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ప్రజలు ప్రధాని మోదీ పేరు జపిస్తున్నారని అన్నారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కాగా, ప్రజలను నమ్మించి వంచించడంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందు దొందేనని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. కొన్ని ప్రతిపక్షాలు ఇండియా కూటమి పేరుతో ఏకమై అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నాయని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి..

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి కోరారు. పెద్దకొత్తపల్లిలో ఆమె మాట్లాడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, సంకల్ప యాత్ర ప్రముఖ్ శ్రీవర్ధన్‌రెడ్డి, ఆచారి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సాయికృష్ణగౌడ్, సుధాకర్‌రెడ్డి, బాలాజీ, రేణయ్య, నాగరాజు, మంగ్యానాయక్, ధర్మానాయక్, శ్రీనివాసులు, రామోజీ, సలేశ్వరం, జలాల్ శివుడు, భీమేశ్వర్‌రెడ్డి, తిరుమల్, శేఖర్‌గౌడ్, శేఖర్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

- బల్మూర్, అనంతవరం, కొండనాగుల, సీతారాంపూర్ మీదుగా విజయ సంకల్ప యాత్ర కొనసాగింది. ఈసందర్భంగా ఉమామహేశ్వర రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా నాయకుడు సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు ఆర్టీసీకి సంబంధించి తమ సూచనలు, ఫిర్యాదులను సెల్ నం.99592 26295 ద్వారా తెలియజేయాలని ఆమె కోరారు.

సమష్టి చర్యలతో చీడపీడల నివారణ



వీపనగండ్ల: మామిడి తోటలకు వ్యాపిస్తున్న చీడపీడలను సమష్టి చర్యలతోనే అరికట్టవచ్చని పాలెం కేవీకే ఉద్యాన అధికారి శంకర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో మామిడి రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంపెనీ జోనల్ మేనేజర్ గోవిందరావు నానో డీఏపీ, ప్రథమ, ద్వితీయ సూక్ష్మ పోషకాల ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి కృష్ణ, ఏఈఓ రజిత, కంపెనీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, రవికుమార్, ప్రవీణ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

కందులు క్వింటా రూ.9,909

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.9,909, కనిష్టంగా రూ.9,509 ధర కేటాయించారు. అదేవిధంగా వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,291, కనిష్టంగా రూ.4,102, ఉలువలు రూ.6,619, జొన్నలు గరిష్టంగా రూ.5,619, కనిష్టంగా రూ.4,551, పెబ్బర్లు గరిష్టంగా రూ.6,669, కనిష్టంగా రూ.6,589, మినుములు రూ.8,960 చొప్పున లభించాయి.


పొదుపుతో మంచి భవిష్యత్



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎల్‌డీఎం కౌశల్‌కుమార్ పాండే

కందనూలు: పొదుపు పద్ధతులు పాటించడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని ఎల్‌డీఎం కౌశల్‌కుమార్ పాండే అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచన మేరకు ప్రతి ఏడాది ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ పొదుపు పద్ధతులపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలను తెరిచి, డబ్బును పొదుపు చేయడం వల్ల భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా డిజిటల్ లావాదేవీలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. బ్యాంక్ అకౌంట్ వివరాలతో పాటు ఓటీపీలను అపరిచిత వ్యక్తులకు చెప్పవద్దని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లోని బ్యాటరీ చార్జెస్ ఉపయోగించరాదని, వాటితో వ్యక్తిగత వివరాలు సైబర్ నేరస్తులకు చేరుతాయని, అలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి జీవీ రమేష్, ఏపీజీవీబీ ఆర్‌ఎం రంజిత్, ఎస్‌బీఐ ఏడీఎంఎం సత్యనారాయణ, ఎస్‌బీఐ మేనేజర్ రాజేష్ బేరి, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న డీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

అచ్చంపేట: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జక్క రామస్వామి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం డీటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నిబద్ధతతో సామాజిక బాధ్యతగా కామన్ స్కూల్ విధానం, శాస్త్రీయ విద్యా విధానం కోసం పనిచేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలని.. అందరికీ సమాన విద్య అందాల్సిన అవసరం ఉందన్నారు. విద్యను ప్రైవేటీకరించడం, కార్పొరేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుతుందన్నారు. సమాజాభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో మోతీరాం, నాగేశ్వర్‌రావు, విజయశాంతి, భీమయ్య, నర్సింహులు, భాస్కర్, జగదీష్, వెంకటనారాయణ, కృష్ణయ్య, మల్లారెడ్డి, శంకర్, కమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రవి (ఫైల్)

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తికి చెందిన రవి (18) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. నిడుగుర్తికి చెందిన మోనప్ప కుమారుడు రవి వారంరోజుల కిందట తన స్నేహితుడు జనార్దన్‌తో కలిసి బైక్‌పై శ్రీశైలం వెళ్తుండగా.. నాగర్‌కర్నూల్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో రవికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి మృతి చెందినట్లు తెలిపారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముగ్గురిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: క్షుద్ర పూజలకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న పూల దుకాణంతో పాటు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ ఫర్నిచర్ దుకాణం వద్ద ఈనెల 25న అర్ధరాత్రి లింగాలకు చెందిన ఇనాయత్, జిల్లా కేంద్రానికి చెందిన మోయిన్, కౌన్సిలర్ ఖాజాఖాన్‌లు క్షుద్ర పూజలకు సంబంధించిన సామగ్రిని ఉంచి వెళ్లిపోయారు. సోమవారం పూల దుకాణానికి వచ్చిన యజమాని ఖాదర్‌షాషా క్షుద్ర పూజల సామగ్రిని గుర్తించి, అనుమానంతో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. క్షుద్ర పూజల సామగ్రిని పూల దుకాణం వద్ద వదిలి వెళ్లే దృశ్యాలు రికార్డు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: పట్టపగలే ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన వనపర్తి మండలం పెద్దగూడెం తండాలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ జలందర్‌రెడ్డి వివరాల మేరకు.. పెద్దగూడెం తండాకు చెందిన హీర్యల్‌నాయక్ ఇంటికి తాళంవేసి, కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నంవేళ గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి, బీరువాలో ఉన్న రూ.50 వేలను చోరీ చేశారు. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు.. తమ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. హీర్యల్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగుచేస్తున్న రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో పెబ్బేరు, కొత్తకోట, నర్వ, అమరచింత, మక్తల్, ఆత్మకూర్‌లోని చెరుకు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫారస్ మేరకు టన్నుకు రూ.5,600 చెల్లించాలని, సీడీసీ నిధులతో రహదారుల మరమ్మతులు చేపట్టాలని, పంట అప్పగించిన 30 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, కోతకు సరిపడా లేబర్‌ను రప్పించాలని, నిర్ణయించిన ధరకే కోతలు పూర్తి చేయాలని, కటింగ్, ట్రాన్స్‌పోర్టు అన్నీపోను మద్దతు ధర చెల్లించాలని, వేరు పురుగు నష్టపరిహారం ఎకరాకు రూ.35 వేలు ఇవ్వాలని, అధిక దిగుబడులు వచ్చే విత్తనాలు అందించాలని, రవాణా సమయంలో జరిగే ప్రమాదాలకు ఫ్యాక్టరీయే బాధ్యత వహించాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, రాయితీపై డ్రిప్ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వాసారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి శివుడు, నాయకులు తిరుపతయ్య, నారాయణ, రంగారెడ్డి, సంజీవరెడ్డి, చెరుకు రైతులు పాల్గొన్నారు.

వెంకన్నకు ‘శఠగోపం’


జంగంరెడ్డిపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం

- ఆస్తులున్నా ఆలయ అభివృద్ధి సున్నా
- నామమాత్రపు ఉత్సవాలకే పరిమితం
- పట్టించుకునే నాథుడే కరువు
- అభివృద్ధికి నోచుకోని జంగంరెడ్డిపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం


వేంకటేశ్వరస్వామి దేవాలయం, భూములు

గండేడ్: మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లిలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.కోట్లు విలువ చేసే భూములున్నా.. ఆలయ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. తాతల కాలంలో నిర్మించిన ఆలయం ఇప్పటికీ అదే రీతిలో ఉంది. నామమాత్రపు కౌలు చెల్లిస్తూ.. ఆలయ అభివృద్ధికి మంగళం పాడి దేవుడికి శఠగోపం పెడుతున్నారు.

165 ఎకరాల భూమి..

వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించి జంగంరెడ్డిపల్లి దేవుని చెరువు, గండేడ్ ద్యావల్ చెరువు, రెడ్డిపల్లి రెడ్డి చెరువు కింద గండేడ్, రెడ్డిపల్లి, అంచన్‌పల్లి గ్రామాల్లో తరితో పాటు చెల్కా 165 ఎకరాల భూములు ఉన్నాయి. ప్రతి ఏటా ఈ భూములు సాగువుతున్నాయి. దీని ద్వారా వచ్చే కౌలు డబ్బులతో ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. అయితే ఉత్సవాలు నిర్వహించడం వరకు తప్పిస్తే ఆలయ అభివృద్ధికి ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఈ దేవాలయం కింద భూములకు గాను నామమాత్రపు కౌలు వసూలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి కొందరే కాస్తులో ఉంటున్నారు. ఎకరాకు ఇంత అని పక్కాగా కౌలు ధర నిర్ణయించకపోవడంతో రూ.100, రూ.200 కౌలు చెల్లిస్తూ వచ్చారు. కొందరు చెల్లించని సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ఉత్సవాల నిర్వహణకు చందాలు వసూలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం చెల్కా పొలానికి రూ.1,500, తరి పొలానికి రూ.2,500 కౌలు ధర నిర్ణయించారు. పెరిగిన ధరలకు నిర్వహణ భారంతో వచ్చిన డబ్బులు కూడా ఉత్సవాలకే సరిపోవడం లేదు. కౌలు పెంచకుండా రాజకీయ రంగప్రవేశం చేయడంతో ఆలయ అభివృద్ధికి అవరోధంగా మారుతుంది. ప్రతి రెండేళ్లకో మారు ఆలయ కమిటీని ఎన్నుకుంటారు. ప్రస్తుతం ఉన్న కమిటీ పదవీ కాలం పూర్తయి ఏడాది గడిచినా.. కొత్త కమిటీ ఏర్పాటు కాలేదు. దీంతో ఆలయ బాగోగులు చూసే వారు లేకుండా పోయారు.

కల్యాణ మండపం కట్టాలి...



భూములుండి కూడా దేవాలయం అభివృద్ధి జరగడం లేదు. జాతర సమయంలో తప్పిస్తే దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. పంటలు పండించుకుంటున్న వారు ఆలయ అభివృద్ధికి కౌలు సరిగా చెల్లించాలి. ఇక్కడ కల్యాణ మండపం నిర్మిస్తే జాతరతో మిగతా సమయంలో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. – కోస్గి వెంకటమ్మ, జంగంరెడ్డిపల్లి

ఈ ఏడాది కౌలు పెంచాం...

గతంలో కౌలు చాలా తక్కువ ఉండేది. ఈ ఏడాది తరికి రూ.2,500, చెల్కా పొలానికి రూ.1,500 పెంచాం. దాని ద్వారా వచ్చే ఆదాయంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. వచ్చిన డబ్బులు కేవలం ఉత్సవాల వరకే సరిపోతున్నాయి. అదనపు ఆదాయం వస్తే ఆలయ అభివృద్ధికి వినియోగించవచ్చు. తాగునీరు గ్రామపంచాయతీ వారే ప్రతిఏటా సమకూరుస్తారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – ప్రసాద్, ఎండోమెంట్ అధికారి

ఆలయంలో ఇబ్బందులు..

ఆలయాన్ని రాతితో కట్టారు. దాని చుట్టూ చిన్న రాళ్లతో ప్రహరీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది శిథిలావస్థలో ఉంది. ధ్వజస్తంభం కూడా కూలిపోయే దశలో ఉంది. ప్రతిఏటా సున్నం వేసి ఉత్సవాలు కొనసాగించడం తప్పా.. మరమ్మతులు గాని ఇతర అభివృద్ధి పనులు ఏమి చేపట్టడంలేదు. మూడు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు రాత్రివేళల్లో ఉండాలన్నా.. ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయంలో నీటి సౌకర్యం లేదు. ప్రతి సారి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేవు. ప్రస్తుతం చెరువు పూర్తిగా ఎండిపోయింది. స్నానాలు చేయడానికి కూడా అక్కడ కష్టంగా ఉంది. రాత్రి బస చేసేందుకు ఎలాంటి గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధి చేపడితే.. ఉత్సవాలు చేసేందుకు అవకాశం ఉంటుంది.

మానవ మనుగడకు పర్యావరణం కీలకం


సావరన్‌ను ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మానవ మనుగడకు పర్యావరణ సమతుల్యం కీలకమని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం కెమిస్ట్రీ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమిపై మానవ మనుగడ సజావుగా సాగాలంటే పర్యావరణ సమతుల్యం, సుస్థిరత అవసరమని.. అందుకు కెమిస్ట్రీ సబ్జెక్టు ఎంతో కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పరిశోధనలు జరగడం ద్వారా మానవ జీవితాలు సాఫీగా సాగుతాయన్నారు. మానవుడికి ప్రధాన ముప్పు దోమల నుంచి పొంచి ఉందని, ఆ ముప్పును తొలగించేందుకు విస్తృతమైన పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి సహజసిద్ధమైన శాస్త్రవేత్త అని, 80 శాతం ఔషధాలను ప్రకృతి నుంచే పొందుతున్నట్లు వివరించారు. వెహికిల్స్, ఎలక్ట్రానిక్స్, గృహరంగం వంటివి కెమిస్ట్రీతో అనుసంధానమై ఉన్నాయన్నారు. రీసెర్చ్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఫెలోషిప్‌లు ఇస్తున్నాయని.. వాటిని విద్యార్థులు వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సైతం రీసెర్చ్‌పై దృష్టి సారించాలని తెలిపారు. ఐఐసీటీలో పరిశోధనలు చేయాలంటే నెట్, సెట్, జేఆర్‌ఎఫ్ వంటి అర్హతలు ఉండాలని సూచించారు.

పీయూలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు..

పీయూలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైస్‌చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ చెప్పారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కెమిస్ట్రీ విభాగంలో వస్తున్న మార్పులను గమనించాలని విద్యార్థులకు సూచించారు. తరగతి గదిలో సందేహం ఉన్న ప్రతి అంశాన్ని నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం సావరన్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, ఈసీ మెంబర్ నూర్జహాన్, కన్వీనర్ శ్రీధర్, అధ్యాపకులు మనోహర్, నాగయ్య, రాజేందర్ రెడ్డి, కోకన్వీనర్ రామ్మోహన్, రవికుమార్, రూపావాణి పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థిని

108 సిబ్బంది నిజాయితీ


వైద్యుల సమక్షంలో నగదును బాధితుడి సహచరులకు అందజేస్తున్న 108 సిబ్బంది

క్షతగాత్రుడి సహచరులకు రూ.10 లక్షలు అప్పగింత

గండేడ్/మహమ్మదాబాద్: బైక్ అదుపుతప్పి కింద పడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలించడమేగాక అతడి వద్ద ఉన్న రూ.10 లక్షలను సహచరులకు అందజేసి నిజాయితీ చాటుకున్నారు 108 సిబ్బంది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి చెందిన కృష్ణమూర్తి మంగళవారం మహబూబ్‌నగర్ ప్రధాన తపాలా కార్యాలయంలో రూ.10 లక్షలు డ్రా చేసుకొని తిరిగి గ్రామానికి బయలుదేరారు. మహమ్మదాబాద్ మండలం నంచర్ల సమీపానికి చేరుకోగానే అతడు నడుపుతున్న బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న వాహన సిబ్బంది పైలట్ చాంద్‌పాషా, ఈఎంటీ లక్ష్మీనారాయణ ప్రథమ చికిత్స అందించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి వద్ద ఉన్న రూ.10 లక్షల నగదును అంబులెన్స్ సిబ్బంది ఆస్పత్రిలో వైద్యుల సమక్షంలో కృష్ణమూర్తి సహచరులకు అందజేశారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాగు అప్పగింత

జడ్చర్ల: జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై దొరికిన బ్యాగును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. మండలంలోని లింగంపేటకు చెందిన వెంకటేశ్ సోమవారం బైక్‌పై గ్రామం నుంచి జడ్చర్ల వైపునకు బయలుదేరారు. గంగాపూర్ సమీపంలో ఎరుపురంగు బ్యాగు రోడ్డు పక్కన పడి ఉండటం గుర్తించిన వెంకటేశ్ దానిని జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బ్యాగులో కొంత నగదుతో పాటు విలువైన వస్తువులు ఉన్నాయని.. బాధితుడు పూర్తి వివరాలతో వస్తే విచారించి అప్పగిస్తామని సీఐ తెలిపారు. బ్యాగును అప్పగించి నిజాయితీని చాటుకున్న వెంకటేశ్‌ను సీఐ అభినందించారు.


సీఐ ఆదిరెడ్డికి బ్యాగు అందజేస్తున్న వెంకటేశ్

బస్సులో మర్చిపోయిన ల్యాప్‌టాప్..

కందనూలు: ప్రయాణికుడు మైనుద్దీన్ 15 రోజుల క్రితం నాగర్‌కర్నూల్ డిపో బస్సులో ప్రయాణించి ల్యాప్‌టాప్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర విలువైన డాక్యుమెంట్లు ఉన్న బ్యాగును బస్సులోనే మర్చిపోయారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ దేవరాజ్ ఆయనకు అందజేశారు. ఆధార్, పాస్‌పోర్ట్ ఆధారంగా ప్రయాణికుడికి తెలియజేసిన డ్రైవర్ రవికుమార్, కండక్టర్ రవీందర్‌ను డిపో మేనేజర్ అభినందించారు.


ల్యాప్‌టాప్ అందజేస్తున్న డిపో మేనేజర్ దేవరాజు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలోని క్షతగాత్రులకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రథమ చికిత్స చేసి ఒకదిక్కు వృత్తిధర్మాన్ని, మరోదిక్కు మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం సాయంత్రం జిల్లాకేంద్రం నుంచి జాజాపూర్ గ్రామం వైపు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తన వాహనంలో వెళ్తుండగా అదే సమయంలో ద్వారక స్కూల్ దగ్గర ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి వారిని తన కాన్వాయ్‌లోని ఒక వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాను వృత్తిరీత్యా వైద్యురాలు కావడంతో సంఘటనా స్థలంలోనే క్షతగాత్రులకు స్వయంగా ప్రథమ చికిత్స చేసి మానవత్వం చాటారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం, కొత్తపల్లి ఊకచెట్టు వాగులో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. మంగళవారం రామన్‌పాడులో 1,016 అడుగుల వద్ద ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి వివరించారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా ప్రాజెక్టుకు నీటి సరఫరా నిలిపివేశారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు.

పార్లమెంట్ అభ్యర్థులుగా బీసీలను ప్రకటించాలి

బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థులుగా బీసీలకు సీట్లు కేటాయించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం వివిధ కులసంఘ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అగ్రవర్ణాల కొమ్ముకాస్తున్నాయని, ఆ కోణంలో కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాలకే సీటు కేటాయించిందని, మిగిలిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఈసారి ఎంపీ అభ్యర్థులుగా బీసీలకు కేటాయించాలని ఆయా పార్టీ జిల్లా అధ్యక్షులకు లేఖలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీజేపీ నుంచి ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్న రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌కు సీటు ఇవ్వాలని, బీఆర్‌ఎస్ నుంచి కూడా బీసీ అభ్యర్థికి సీటు ఇవ్వాలని కోరుతూ ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అన్ని పార్టీలు అగ్రవర్ణాలకు సీట్లు కేటాయిస్తే ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. 60 నుంచి 65 శాతం ఉన్న బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ సీటు విషయంలో అన్ని పార్టీలు ఆలోచించి నిర్ణయం తీసుకొని బీసీలకు కేటాయిస్తే పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని తమ కులసంఘాల నాయకులతో పాటు అన్ని బీసీ సంఘాలు, విద్యార్థి, ప్రజాసంఘాలతో కలిసి ఆ బీసీ అభ్యర్థిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ సవారి సత్యం, తెలంగాణ రజక సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములపై తేనెటీగల దాడి

- 15 మందికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


పరామర్శిస్తున్న నాగురావునామాజీ

నారాయణపేట రూరల్: శివస్వాములపై తేనెటీగలు దాడిచేసిన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గాంధీనగర్ లింగయ్యస్వామి ఆలయంలో శివస్వాముల మహా పూజ అనంతరం భిక్ష కోసం చెట్ల కింద వంటలు చేస్తున్న క్రమంలో తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో స్వాములతో పాటు భక్తులు ఆలయం నుంచి పరుగులు తీశారు. కాలనీవాసులు భయాందోళనకు గురై తలుపులు, కిటికీలు మూసివేశారు. తేనెటీగల దాడిలో 15 మంది స్వాములకు తీవ్ర గాయాలు కాగా.. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివ స్వాములను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావునామాజీ పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా, లింగయ్యగుడి వద్ద శివస్వాములు మహాపూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా మహంకాళి వీధిలోని శివాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించిన అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

సెమీస్‌కు మహబూబ్‌నగర్, హైదరాబాద్ జట్లు


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ రవీందర్

హోరాహోరీగా రాష్ట్రస్థాయి అండర్–14 క్రికెట్ టోర్నీ


బ్యాటింగ్ చేస్తున్న మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారులు

జడ్చర్ల టౌన్: పట్టణంలో అండర్–14 బాలుర రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నీ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆతిథ్య ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు హైదరాబాద్ జట్టు సెమీస్‌కు చేరుకున్నాయి. మరో రెండు జట్లు సెమీస్ రేసులో ఉన్నాయి. మినీ స్టేడియం మైదానంతో పాటు గంగాపురం రోడ్‌లో ఉన్న ఎంఎస్ మైదానంలోనూ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. టోర్నీ రెండోరోజు మంగళవారం మహబూబ్‌నగర్ జట్టు నల్లగొండపై 10 వికెట్ల తేడాతో, నిజామాబాద్‌పై 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో టోర్నీలో మూడు వరుస విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. హైదరాబాద్ జట్టు నల్లగొండ, నిజామాబాద్ జట్లపై గెలిచి సెమీస్‌కు చేరింది. అలాగే ఎంఎస్ గ్రౌండ్‌లో రంగారెడ్డి– కరీంనగర్ జట్లు పోటీపడగా 36 పరుగుల తేడాతో రంగారెడ్డి విజయం సాధించింది. ఇదే గ్రౌండ్‌లో అదిలాబాద్– కరీంనగర్ జట్లు తలపడగా 9 వికెట్ల తేడాతో అదిలాబాద్ గెలుపొందింది. వరంగల్– నిజామాబాద్ జట్లు పోటీపడగా 47 పరుగుల తేడాతో వరంగల్ విజయం సాధించింది. ఇక మినీ స్టేడియంలో మెదక్– అదిలాబాద్ జట్లు పోటీపడగా 8 వికెట్ల తేడాతో అదిలాబాద్ గెలుపొందింది. మెదక్– ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో ఖమ్మం గెలిచింది.

జిల్లాకు పేరు తీసుకురావాలి

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీని డీఈఓ రవీందర్ సందర్శించారు. ఈ సందర్భంగా సెమీస్‌కు చేరుకున్న మహబూబ్‌నగర్ జట్టును అభినందించారు. జిల్లాకు పేరు తీసుకువచ్చేలా రాణించాలని క్రీడాకారులకు సూచించారు. మిగిలిన జట్ల క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, గెలిచిన వారు మరో గెలుపు కోసం కృషిచేయాలని, ఓడిన వారు గెలుపు కోసం కష్టపడాలని, లోటుపాట్లు గుర్తించి వాటిని సరిదిద్దుకోవాలన్నారు. అనంతరం బ్యాటింగ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఏఎంఓ బాలుయాదవ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, నిర్వాహకులు గోపాల్, శారదాబాయి, ఆనంద్, కృష్ణ, మోయిన్, రామకృష్ణ, రాములు, శంకర్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వదంతుల కలకలం


హాస్టల్ వద్ద బాలుడిని విచారిస్తున్న పోలీసులు

అడ్డాకుల: మూసాపేటకు మూడోసారి పిల్లలను ఎత్తుకెళ్లే వారు వచ్చారన్న వదంతులు కలకలం రేపుతున్నాయి. స్థానికుల కథనం మేరకు.. ప్రభుత్వ బాలుర వసతిగృహంలో 4వ తరగతి విద్యార్థి తేజ మంగళవారం యథావిధిగా స్థానిక ప్రాథమిక పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం మూత్ర విసర్జనకు బయటకు రాగా గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకున్నారు. భయపడిన బాలుడు తప్పించుకుని ఏడుస్తూ పరుగెత్తగా కొంతదూరంలో సీసీ రోడ్డు వేస్తున్న స్థానికులు గుర్తించి బాలుడిని ఆపి వివరాలు సేకరించారు. ఎవరో తనను పట్టుకుని తీసుకెళ్తుండగా తప్పించుకున్నట్లు చెప్పడంతో స్థానికులు మొక్తదీర్‌బాబా, బ్రిక్స్ పాషా బైక్‌పై తిరిగి వెదికారు. ఎవరూ కనిపించకపోవడంతో బాలుడిని తిరిగి హాస్టల్‌కు పంపించారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్టల్ వద్దకు వచ్చి బాలుడితో వివరాలు సేకరించారు. విద్యార్థులెవరూ అధైర్యపడొద్దని సూచించారు. ఈ ఘటనతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిల్లలను ఎత్తుకెళ్లే వారు తిరుగుతున్నారన్న వదంతులు రావడం.. తాజాగా బుధవారం ఘటనతో అసలేం జరుగుతుందోనన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.